# కర్మయోగి

-కొలనుపాక మురళీధరరావు

వెంకయ్య గోరుకోళ్ళు పొడవగానే లేచి దున్నపోతులను తీసుకుని గొల్లోని బాయికాడ్కి పోయి మోట బొక్కెన తొండం సరిచేసుకుంటూ 'నీ అవ్వ! అప్పుడే తొండంకు చిల్లులు పడ్డది. మొన్ననే కట్టంగూరు అంగట్లో కొనుక్కొచ్చిన, ఏం కుట్టిన్రో' స్వగతంగా అనుకుంటూ దున్నపోతులను కట్టి "నారాయణో ఆదినారాయణో మమ్మేలుకో" అంటూ పదం పాడటం మొదలుపెట్టిండు.

చిన్నప్పటి నుంచి వెంకయ్యకు లల్లాయిపదాలు పాడటం వచ్చు. ఇంకా వూర్లోకి భాగోతపోళ్లు వస్తే వాళ్ల ఎంబడే ఉండి వాళ్లు పాడే పద్యాలు గుర్తుపెట్టుకుని మోట కొట్టేటప్పుడు పాడుకుంటాడు. ఆయనది కంచు కంఠం. ఆయన పదం మొదలుపెట్టాడంటే గూడెం వాళ్లకి కోడికూయనవసరం లేదు. మోటకొట్టే యాల అయిందని మిగతా గూడెపు పోరగాండ్లు పన్లలోకి జొరబడతరు.

అరవై ఏళ్లొచ్చినా అలుపెరగని మనిషి. గట్టిం గుండు. రెండు ఎకరాల పొలం బాయి కింద. రెండు ఎకరాల చెల్క బాయికానుకుని వుంది. కాలం బాగైతే ఈ ఏడు దాన్ని కూడ తరిపొలం కింద చేస్తే కాలు చేయి ఆడించొచ్చు. ఇది తాతలు సంపాదించిన ఆస్తి. దీంతోనే తన తండ్రి తన ఇద్దరు మొగబిడ్డలు, ఒక ఆడపిల్లను పెంచి పెద్దచేసిండు. వారికి పెండ్లి చేసిండు. ఇంద తన పాలుకొచ్చిన ఈ పొలంతో తాను పొట్ట పోసుకుంటున్నాడు.

వెంకయ్యకు కూడా తండ్రి పోలిక వచ్చినట్టుంది. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఆయన కూడా తండ్రి లెక్కనే కొడుక్కి పెండ్లి చేసి, ఆడబిడ్డను ఓ అయ్య చేతిలో పెట్టిండు. పెద్ద కొడుకు తోట పెట్టుకుని బతుకుతూండు. చిన్నోడు "నాయనా, నే చదువకుంటా. వ్యవసాయం ఇష్టం లేదు" అని పట్నందారి బట్టి కాలేజీలో చేరి వారానికో మరి పండక్కో పబ్బానికో వస్తూ పోతుంటాడు. పెద్దకోడలు కష్టపడే పిల్ల. ఆమె తల్లీ, తండ్రీ చిన్నప్పుడే పోయిన్రు. కష్టాలు తెల్సిన పిల్ల. అత్త పోయినప్పటి నుంచి మామను తానే చూసుకుంటోంది. రెండో కొడుకు తన కాళ్లమీద తాను నిలబడ్డ తరువాతే పెండ్లి చేసుకుంటానన్నాడు. సరే వాడిష్టం అనుకున్నాడు వెంకయ్య.

ఒకరోజు దాపట దున్నపోతు కుంటుతోంది. ఏమైందో మోటకొట్టడం అయిం తరువాత పశువుల డాక్టరుకు చూపించాలే. పది మళ్ళు తడిసినై. ఇంగ దున్నపోతులను కాడి నుంచి ఇడ్చేసి బొక్కెన మోటగిల్ల మీద సర్దిపెట్టి, తొండం కూడా చిల్లులు కుట్టించడానికి ఊళ్లో గూడెంపాయనకిస్తె ఆయనే చూసుకుంటాడు. ఎట్లాగు పాతబడ్డది ఈ యాసంగి అయిపోతె కొత్త బొక్కెన, తొండం కొంటె మంచిదనుకొని ఇంటిదారి పట్టిండు. అప్పుడే సూరీడు బారెడు పొద్దెక్కిండు.

"అరె శీనయ్యా గీ దున్నపోతు కుడికాలు చూడు కుంటుతుంది. నేను మొగం కడుక్కోని వస్తా. దవాఖానాకు తీసుకెడితే డాక్టరు ఏదైనా సూదిమందు వేస్తాడో కనుక్కోవాలి" అన్నాడు కొడుకు శీనయ్యతో మొగం కడుక్కుంటూ.

రెండో కొడుకు రమేశ్ అప్పుడే వచ్చిండు. పరీచ్చలు అయిపోయిన వంట. వస్తూనే "ఏం బాపూ ఇంకా ఈ మోట దున్నపోతులెందుకు. ఊళ్లోకి కరెంటు వచ్చింది గదా. మోటరు బాయికి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ సాగుబడి చేయొచ్చుగదా" అన్నాడు.

"చూడు బిడ్డా నా తరం ఇట్టాగే గడిచిపోనీ. మోటకు నీటి ఊటకు సంబంధముంది. కొంచెం ఆలస్యమైనా ఊటను బట్టి నీటిని వాడుకోవాలి. మరి

## మా ఊరి బాలు

గద్వాల బాలలం / నడిగడ్డ శూరులం
తెగువలో మేమంత / హనుమప్ప బంటులం
మా కోట మా పేట
చరితలోన ఒక పుట
ఎల్లమ్మ మాతంగి / ఎల్లమ్మ ఫిరంగి
జాతరకు యాతరకు / రంగు తగ్గని పొంగు
చేనేత ధీశాలి / మెరిపించె మురిపించె
చీరతళుకులు పెంచి / దేశ కీర్తిని పెంచె
మా చరిత ఘనచరిత / పుట్టి పెరిగినందుకు
నేల తల్లి కీర్తిని / దశదిశల పెంచుతాం

-జె. కొండన్న

కరెంటు మీద ఆధారపడితే కరెంటు రాకడ పొనం పోకడ ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలీదు అన్నాడు మీ బావ. కరెంటు కోతతో చస్తున్నాం అంటు దిగాలు పడుతున్న వాళ్లను చూస్తుంటే నిజమే అనిపిస్తుంది ఒక్కోసారి. ఇది రైతు గుండె కోత. కరెంటు మోటారుతో నీటి వూట తట్టుకోలేదు. బుడబుడ నీళ్లు పోసినా పొలాలు ఆరుతడికి భూమికి సరిపోదయ్యా. ఈ రెండు ఎకరాలు ఇట్టాగె చేద్దాం.

మనకు కారుకు నాల్గు పుట్లు మిగులుతాయి. ఎరువు మట్టి మన దొడ్లోదె కదా ఇంక పటేలు దొడ్లోది మనకిస్తనన్నడు. నీవేమి ఫికరు పడకుండా చదువుకో" అన్నాడు రెండో కొడుకు రమేశ్‌తో కుంటుతున్న దున్నపోతును పశువుల దవాఖానకు తీసుకుపోతూ.

"దున్నపోతుకు గాళ్లు పోసినై. రెండురోజుల్లో తగ్గుద్ది" సూది మందు కూడా వేసి అన్నాడు కాంపౌండరు. "రెండు రోజులు పనిలోకి తీసుకోకు, మళ్లా నీకిబ్బంది" అన్నాడు.

చెల్కలో ఉన్న కందులు మధ్య మధ్య గోంగూర, ఆనపకాయల పాదు, బీరపాదు మిద్దెమీది ఎక్కి పిందెలు వేసినై.

కాలం మారుతోంది. మారుతున్న కాలపు అలవాట్లకు తాను ఇమడలేక అదే పాతకాలపు అలవాటుతో నింపాదిన బదుకుబండి లాగుతూండు. వెంకయ్య స్వతహాగా మెతక మనిషి. ఎవరి జోలికి పోడు. ఎగసాయం, గొడ్డూ గోదా గల సీదా సాదా రైతు. అందుకే వెంకయ్య అంటే ఆ వూర్లో సాత్వికుడని పేరు. తనకు తోచిన సలహాల కోసం అందరు పెద్దమనిషిగా గౌరవిస్తారు. ఆయనకాడ్కి వస్తారు.

పంట చేతికొచ్చే వేళైంది. కళ్ళంసాపుచేసి వరి కోతలు చేయించి కట్టలు బంతులు కట్టించి వడ్లు రాలేవరకు గొడ్లతో తొక్కించి చెత్తా చెదారాన్ని తూర్పార పట్టించేయాళకు సూర్యుడు అలసి సొలసి తల్లి ఒడిలోకి పోతుండు. కళ్లంలో వడ్లు కొలిచి కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి, ఇతర కులాల వారికి పంచిపెట్టి ఒక కుండెడు పులిహోర నిరంతరం తనను కాపాడుతున్న హనుమంతున్ని పులికాపు చేయించి అందరికీ దేవుని ప్రసాదంగా పంచిపెట్టిన తరువాత చేతికి వచ్చిన పంట తన కష్టానికి ఫలితంగా సరిపోయిందని తృప్తి పడిండు ఆ పెద్దాయన.

కుంగిపోతున్న సూర్యునికి తన బతుకు కృంగిపోకుండా కాపాడుతున్నందుకు చేతులు జోడించాడు.

## గోవిందుడు అందరి వాడేలే

పక్కవీధి రాములోరి గుడి
అయ్యవోరే-
మాల కాకినని
ముట్టుకోని నాతో-
సాక్షాత్తూ కంచిసామి
జయేంద్ర సరస్వతులే
ఇంతి బువ్వ తిన్నారా?!
ఏడుకొండలూ దిగివచ్చి
కళ్యాణ గోవిందుడు
నాతో
ఊంజల సేవలందుకొన్నాడా?!
ఇది కలా-
వైష్ణవమాయా?!

-ఆర్. ఎస్.

అట్టాగె హనుమంతుని ముందు సాగిలపడ్డాడు. ఆకాశం మబ్బులు కమ్ముకుంటున్నాయి. సంక్రాంతి మబ్బులంటె తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఆకాశంలోకి చూస్తూ మబ్బు తెరల కదలికలు చూస్తూ యాపచెట్టు కింద కాళ్ళ మంచం వేసుకుని చుట్ట లాగుతూ మమేకం చెందుతాడు వెంకయ్య.

ఆ పెద్దమనిషికి ప్రపంచీకరణం గురించి గాని, దాని నేటి రాజకీయ భాగోతం గాని తెలీదు. దాన్ని పట్టించుకోడు కూడా. ఎవరి బతుకులు వారివి, ఎవరి తత్వం వారిది అనుకుంటూ మనుమనితో కాలక్షేపం చేస్తుంటాడు. పాలకులు ఎందరు మారినా పాలితుల బతుకులు మారనే మారవు.

వెంకన్న తాతకు ఇవి తెలిసినా తెలియక పోయినా నష్టమేమి లేదనుకుంటున్న నేటి తరం. అయినా, తన గ్రామీణ జీవితాన్ని అలవరచుకున్న వెంకయ్యలూ అందరికీ అభిమానులే. చేతులెత్తి దండం పెడతారు. తరం మారుతున్నా తరం మారని ఆ తరం మా వెంకన్న తాత అని తన స్నేహితులకు ఎంతో గొప్పగా చెబుతాడు పెద్ద మనుమడు సురేశ్.

పండుగ సంబరంతో ఇల్లు కళకళలాడుతుంటే సంక్రాంతి లక్ష్మి చిరు గజ్జెల రవళులు వింటూ తన్మయత్వంతో కళ్ళు మూసుకున్న వెంకన్న తాతను చూస్తూ 'కర్మయోగి' అనుకుంటూనే వున్నారు. పాపం వారికేం తెల్సు ఆ కనులు ఇక తెరుచుకోవని. ■